క్లుప్తంగా

విద్యార్థుల పోరాటానికి మద్దతు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్‌హౌస్ ఎదుట హక్కులకు నిరసన తెలుపుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ మద్దతు ఇస్తుందని సంఘం జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతో ఎన్నుకోబడ్డ విద్యార్థి సంఘం అధ్యక్షుడు, మాజీ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులను క్యాంపస్ నుండి సస్పెండ్ చేస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అధికారుల నిర్ణయంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, ప్రజాస్వామ్య వాదులు దీనిని ఖండించాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్యను కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్ కమర్తపు మురళీ, నాయకులు చావా నారాయణరావు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని జల్లెపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ ఆరోగ్య శిబిరంలో హెచ్ఈఓలు నరేష్, రామయ్య, పీహెచ్ఎన్ నిర్మల జ్యోతి, సూపర్‌వైజర్లు ప్రేమలత, వినయశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఎఎన్ఎం నాగమణి, ఆశాలు వీరమ్మ, కవిత పాల్గొన్నారు.

ఎద్దుల చోరీ

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో రైతు పాసిన ప్రభాకర్‌కు రైతుకు చెందిన ఎద్దుల జతను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రైతు రూ.లక్షన్నర విలువైన తన ఎద్దులను పెరట్లో కట్టేయగా, మంగళవారం ఉదయానికి కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎద్దుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టాడు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు ట్రాలీ ఆటోలో ఎద్దులను ఎక్కించి నేలకొండ వైపు తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీల్లో గుర్తించగా పోలీసులు వివరాలు ఆరాతీస్తున్నారు.

తూముల మరమ్మతులు చేపట్టండి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు తూములకు మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ డీఈఈ మన్మథరావుకు ఆయకట్టు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. చెరువుకు ఉన్న తూములు మరమ్మతులకు నోచుకోక చెరువు నీరంతా వృథాగా పోతుందని, అదే విధంగా నందిగామ బ్రాంచి కెనాల్ రెగ్యూలేటర్ షట్టర్లు శిథిలావస్థలో ఉండటంతో చెరువు నీరంతా ఏపీకి వృథాగా పోతుందన్నారు. వెంటనే కొత్త షట్టర్లు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రైతు ప్రతినిధులు అమరగాని యల్లయ్య, ఇంతియాజ్, లక్ష్మీనర్సయ్య, మస్తాన్, యం.నాగేశ్వరరావు, బూడిద బ్రహ్మం, బొడయ్య పాల్గొన్నారు.

దాడులు ఆపాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్ఎంపీలపై దాడులు ఆపాలని తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్ కోరారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఆర్ఎంపీలను నకిలీ డాక్టర్లని సంబోధించడం విచారకరమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు నేరడ హసన్, కార్యదర్శి షేక్ జానిమీయా, వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ నజీరుద్దీన్, కోశాధికారి బాబు సాహెబ్, మదార్ సాహెబ్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

నేలకొండపల్లి: విద్యుదాఘాతంతో మృతిచెందిన వానరానికి గ్రామస్తులు మంగళవారం అంత్యక్రియలు చేపట్టారు. మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామంలో ఓ వానరం విద్యుత్‌స్తంభం ఎక్కటంతో తీగలు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మేలుకోకుంటే ముప్పే..



డ్రెయినేజీల్లో యాంటీ లార్వా స్ప్రే చేస్తున్న సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ అంతంతే

- నగరంలో డెంగీ దోమలు ప్రబలే ప్రమాదం
- డ్రెయినేజీల్లో డెంగీ లార్వా ఉత్పత్తి
- హైరిస్క్ జోన్లుగా ఎనిమిది ప్రాంతాల గుర్తింపు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా డెంగీ వంటి విషజ్వరాలు మూడు, నాలుగేళ్లుగా నగరంలో ప్రబలుతున్నాయి. ఈ వేసవిలో నగరంలో 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో ఈ వ్యాధి మరింతగా విస్తరిస్తుందనే ఆందోళన నగరవాసుల్లో వ్యక్తం అవుతోంది. కేఎంసీ అధికారులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నప్పటికీ డెంగీ దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని డెంగీ దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భయపెడుతున్న డెంగీ

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రధానంగా డెంగీ ప్రజలను భయపెడుతోంది. పూర్తిగా వర్షాలు కురవక ముందే డెంగీ దోమ వృద్ధి చెందకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలి. ఒక్కో డెంగీ దోమ మూడు సార్లు గుడ్లు పెడుతుంది. ఒక్కోసారి 300 చొప్పున మొత్తం 900 గుడ్లు పెడుతుంది. ఈ దోమలు పూర్తిస్థాయిలో విస్తరించకుండా చూడాలంటే నీటి నిల్వ ఉండకుండా చూడాల్సిన అవసరం ఉంది. దాదాపు ఆరు నెలల వరకు గుడ్లు ఉంటాయి. ఒక్కసారి నీరు తగిలిందంటే వెంటనే లార్వా ఉత్పత్తి జరిగి డెంగీ దోమగా రూపాంతరం చెందుతుంది. ఎవరికి వారు నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే డెంగీ దోమను నివారించడం వీలవుతుంది.

చర్యలు నామమాత్రమే..

నగరంలో డెంగీ డేంజర్ బెల్స్ మోగుతున్నప్పటికీ అధికారులు నామమాత్రపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నగరంలో డివిజన్‌కు ఒక కార్మికుడిని నియమించి యాంటీ లార్వా స్ప్రే చేయిస్తున్నారు. అయితే ఇళ్ల మధ్యలో నిల్వ ఉన్న నీటిని తొలగించడంలో ఇప్పటికీ అలసత్వం వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఖాళీ స్థలాల్లో చెరువులను తలపించేలా నీరు నిల్వ ఉంటోంది. వీటిని శుభ్రం చేయించకపోవడంతో ఇక్కడ లార్వా ఉత్పత్తి జరిగే అవకాశం ఉంటుందని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫ్రైడే..డ్రైడేను కూడా ఇంకా ప్రారంభించలేదు. వర్షాకాలంలో అధికారులు మొక్కుబడిగా నగరంలో పర్యటిస్తూ నిల్వ ఉన్న నీటిని పారబోయమని చెప్పడంతో సరిపోతోందని కొందరు చెబుతున్నారు.

వేసవిలోనూ డెంగీ కేసులు

సాధారణంగా డెంగీ కేసులు వర్షాకాలంలోనే ఎక్కువగా నమోదు అవుతుంటాయి. కానీ నగరంలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు దాదాపు 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్యులు కూడా ఆశ్చర్యపోయారు. వేసవిలో కూడా డెంగీ కేసులు నమోదు అవుతుండటంతో హైదరాబాద్‌తో పాటు ఖమ్మంను కూడా ఎండమిక్ ప్రాంతంగా పరిగణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఏడాది పొడవునా డెంగీ కేసులు వచ్చే అవకాశం ఉంది. దీంతో నిరంతరం ఇక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

మిషన్ భగీరథతో ముప్పు..

సహజంగా డెంగీ దోమ లార్వా తాగునీటిలోనే ఉత్పత్తి చెందుతుంది. అయితే ప్రస్తుతం మిషన్ భగీరథతో డెంగీ ముప్పు ఎక్కువగా ఉందని అధికారులు గుర్తించారు. నగరంలోని అనేక మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లకు ట్యాపులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ పైపుల నుంచి నీరు మురుగు కాల్వల్లో చేరుతోంది. ఈ నీటితో మురుగు కాల్వలు శుభ్రమై.. అందులో లార్వా వృద్ధి చెందుతున్నట్లు మలేరియా అధికారులు గుర్తించారు. మిషన్ భగీరథ నీరు మురుగుకాల్వలో కలవకుండా చూడాలని అధికారులు చెబుతున్నారు. ప్రతీ ఇంట్లో నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నగరంలో హైరిస్క్ జోన్‌లు..

గతేడాది నగరంలో 129 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువగా పాండురంగాపురంలో ఏడు, టేకులపల్లిలో ఐదు, ఖానాపురం ప్రశాంతినగర్‌లో 4, వైఎస్సార్ కాలనీలో ఆరు, ఇందిరానగర్ కాలనీలో నాలుగు, శ్రీనగర్‌లో ఐదు, నిజాంపేటలో నాలుగు, రామన్న పేటలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. ఈసారి వీటిని హైరిస్క్ జోన్‌లుగా గుర్తించారు. ఇక్కడ పూర్తిస్థాయిలో దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడ దోమలు ప్రబలకుండా యాంటీ లార్వాను పిచికారీ చేస్తున్నారు. అలాగే పారిశుద్ధ్యంపై కాలనీ వాసులకు అవగాహన కల్పించనున్నారు.

‘28 ఏళ్లుగా సేవలు చేస్తుంటే గెంటేశారు’



ఆలయం వద్ద రామారావు దంపతులు

నేలకొండపల్లి: పైసా జీతం లేకుండా, 28 ఏళ్లుగా ఆలయంలో సేవ చేస్తున్న తనను గ్రామ పెద్దలు ఆలయం నుంచి బయటకు నెట్టేశారని బాధితులు వాపోయారు. నేలకొండపల్లిలోని బైరాగి గుట్ట వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన పర్వత రామారావు కుటుంబం గత 28 ఏళ్లుగా ఉంటూ శుభ్రం చేయటం, రాత్రి కాపాలా కాయడం తదితర పనులు చేస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు గుడిలో ఉండటానికి వీలు లేదని చెప్పటమే కాకుండా, తమ సామగ్రిని బయట పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాక స్వామిపై భక్తితో గుడి పక్కనే గుడారం వేసుకుని విగ్రహాలకు పూజిస్తున్నారని వద్దంటున్నారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం రామారావు దంపతులు ఆలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల ఆలయ సమీపాన గుప్త నిధులు ఉన్నాయనే పుకార్లు పుట్టడంతోనే తమను అక్కడ నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పరామర్శ..

కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిలకల వెంకటస్వామి సతీమణి రంగమ్మ ఇటీవల మృతిచెందగా మంగళవారం బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు హఫీజుద్దీన్, వెంకన్న, వీరస్వామి, చెన్ను వెంకటరమణ, పీబీ శ్రీనివాస్, వడిత్య సైదులు ఉన్నారు.

దాడి ఘటన బాధితులకు..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో దాడి ఘటనలో గాయపడ్డ శీలం కళావతి, విప్లవకుమారులను సీపీఐ ఎంఎల్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లో గాయపడ్డ కళావతి, విప్లవకుమారులపైనే తప్పుడు కేసు నమోదు చేయించడం అన్యాయమన్నారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరించకుండా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సిద్దె పుల్లయ్య, ఆవుల అశోక్, మండల కార్యదర్శి కేళోత్ లక్ష్మణ్, మేక రామనాథం, కూరాకుల నరసయ్య , గుడిగంటి బాబు ,వీరబాబు, తదితరులున్నారు.

కవాతును జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: వరంగల్ నగరంలో జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మద్దులపల్లిలో రిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీస్ నాయకులు కనకం. జనార్ధన్, సంజీవరావు, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



రఘునాథపాలెం: మాట్లాడుతున్న శ్రీకాంత్

రఘునాథపాలెం: సమస్యలు పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పార్టీ మండల స్థాయి కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లో నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీను, నందిపాటి మనోహర్, మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, రహీం ఖాన్, వల్లూరి శ్రీనివాస్, నరేష్, కుమార్, తిరుపయ్య, నల్లమోతు నాగయ్య, మంగమ్మ, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ విద్యావేత్త బోడబట్ల రవీందర్ పాల్గొని ప్రసంగించారు. నాయకులు ఏటుకూరి రామారావు, వెంకన్న, నర్సయ్య, పగిడికత్తుల నాగేశ్వరరావు, భాస్కర్, పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి

ఖమ్మంరూరల్: ఖమ్మంలోని మంచికంటి హాల్లో ఈనెల 29, 30న జరిగే సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ తెలిపారు. స్థానిక వరంగల్ క్రాస్ రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి, క్రిష్ణ, రామయ్య, నాగరాజు, వరప్రసాద్, నర్సింహారావు, రాంబ్రహ్మం పాల్గొన్నారు.

అంగారక సంకటహర చతుర్థి పూజలు



బాల గణపతి ఆలయం వద్ద భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు దేవాలయాల్లో మంగళవారం అంగారక సంకట హర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ఇందిరానగర్ జంక్షన్‌లోని బాలగణపతి ఆలయంలో ప్రధానార్చకుడు గిరి ఆధ్వర్యాన ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు పాల్గొని భక్తులకు అల్పాహారం, తీర్థప్రసాదాలు అందజేశారు. మధురానగర్ సాయిబాబా ఆలయంలోని గణపతి స్వామికి విశేష పంచామృత అభిషేక పూజలు, హోమ పూజలు నిర్వహించారు.

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ నుంచి అమరావతి వెళ్లే జాతీయ రహదారికి తీర్థాల నుంచి కొదుమూరు వరకు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డికి మంగళవారం బాధిత రైతులు విన్నవించారు. ఈ మేరకు తీర్థాల మంగళగూడెం గ్రామాలకు చెందిన రైతులు కలిసి వారి కష్టాలను వివరించారు. ప్రతీ డొంక రోడ్డు వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని, రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పుల చంద్రశేఖర్, వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని మమత రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ మమత రోడ్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ ఖదీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హార్వెస్ట్ స్కూల్ ఏరియా, చెరువు బజార్, అబ్దుల్ కలాం నగర్, పాకబండ బజార్, కర్నాటి కృష్ణ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ధంసులాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు అగ్రహారం, ఎస్ఆర్ హోమ్స్, ధంసులాపురం ఓల్డ్ కాలనీ, న్యూ కాలనీ, సీతారాంపురం, కొత్తూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరనించాలని ఏఈ కోరారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ కోరారు. మంగళవారం ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అయినా విద్యారంగ సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రాంతి, మస్తాన్, సాగర్, రామకృష్ణ, శ్రీకాంత్, సంపత్, కిరణ్, ఉమేష్, గోపి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్



కమల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. మంగళవారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్య, సౌకర్యాలు తదితర అంశాలను హెచ్ఎం వీరస్వామిని అడిగి తెలుసుకున్నారు. కూసుమంచి ఉన్నత పాఠశాల విద్యార్థులు గురుకులాలకు ధీటుగా విద్యను అందిస్తుందని, ఇక్కడి విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించటం విశేషమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తుండటం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుత కాలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు పలు సమస్యలపై జెడ్పీ చైర్మన్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ బీవీ రామాచారి ఉన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత తప్పనిసరి



అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ, అధికారులు

కూసుమంచి: అపరిచితుల ద్వారా వచ్చే మెసేజ్‌లుపై తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని, ఈజీ మనీ పేరుతో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని ఖమ్మం సైబర్ క్రైమ్స్ డీఎస్పీ ఫణీంద్ర సూచించారు. పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతుండగా దీనిలో భాగంగా మంగళవారం క్యాడెట్లకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఫణీంద్ర, ఎస్సై రంజిత్‌కుమార్ విద్యార్థులకు నేరాలు జరిగే తీరు, కట్టడి చేయాల్సిన పదతులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

‘బీజేపీ హయాంలో దేశం దివాళా..’



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చే ఐదు సంవత్సరాల్లో భారతదేశాన్ని పూర్తిస్థాయిలో దివాళా తీసే విధంగా ముమ్మరంగా మోదీ ప్రయత్నిస్తున్నట్టు సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తర రాష్ట్రాల్లో జనం ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారని, కేవలం దక్షిణ రాష్ట్రాల్లో వచ్చిన ఓటింగ్‌తో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకుని సరైన పరిపాలన చేయకపోతే తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న ఖమ్మం నగరంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. నేడు (బుధవారం)న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పి. మోహన్‌రావు, టి.విష్ణువర్ధన్, రామకృష్ణ కె. నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

అదనపు వసూళ్లు చేసే వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న చెరుకుపల్లి బాలు

ఖమ్మం మామిళ్లగూడెం: 28వ డివిజన్ చిన్న మున్నేరు వైకుంఠధామంలో అంత్యక్రియలకు వచ్చే మృతదేహాలకు సంబంధించిన వారి నుంచి కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా అదనంగా డబ్బులు తీసుకునే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాటికాపరి, జాంబవంతుడు సొసైటీ అధ్యక్షుడు చెరుకుపల్లి బాలు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. శానిటేసన్ సిబ్బంది డివిజన్‌లో సేకరించిన చెత్తను వైకుంఠధామం పక్క నే పడవేయటంతో డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తుందన్నారు. సభ్యులు పందివేణు, కె.సైదులు, పడిశాల వీరస్వామి, కె.కాశయ్య, చుక్కయ్య పాల్గొన్నారు.

అవగాహన

కామేపల్లి: మండలంలోని పాస్నేకల్ హైస్కూల్‌లో విద్యార్థినులు, మహిళలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోక్సో చట్టం, పలు టోల్ ఫ్రీ నంబర్లు, ఫోన్ల వినియోగం అనర్థాలు, మహిళలు ఆకతాయిలా నుంచి ఆత్మరక్షణ, వేధించే వారికి పడే శిక్షలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం కోటేశ్వరమ్మ, లీలా, సీతారామ్, సబితారెడ్డి, జ్యోతి, పద్మ, లత, బుల్లి, సూర్యకళ, లక్ష్మీ, ఝాన్సీ, భవాని, రూప, రాధిక, విజయ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో ఉన్న వైన్‌షాపులను మార్చి, ఊరి చివర ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ పి.వి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర సాహూ, ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిరియాల నాగరాజు, ఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు మట్టే నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, మల్హార్, వెంకటేష్ పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

నకిలీ విత్తనాలను అరికట్టాలని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో మండలంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోలేపొంగు నాగయ్య, పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు సుబాహాన్,పేరం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, మాల్సూర్, నాగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నేలకొండపల్లి: ప్రజల సౌకర్యార్థం ప్రతీ మండలంలో సులభ కాంప్లెక్స్ నిర్మించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం మండల కేంద్రంలో మంగళవారం అధికారులు స్థలం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలానికి సమీపంలో 100 గజాల స్థలంలో కాంప్లెక్స్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులు భావించారు. ఎంపీడీవో యం.యర్రయ్య. ఎంపీఓ సిహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: మాల మహానాడు నగర కమిటీని మంగళవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సీనియర్ నాయకుడు గెంతేటి వీరభద్రం, పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో నగర అధ్యక్షుడిగా తురక నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల లక్ష్మీనర్సింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేరం మల్లయ్య, ప్రచార కార్యదర్శిగా రాము, ట్రెజరర్‌గా ఏసురత్నం, ఉపాధ్యక్షులుగా జక్కం స్వాతి, బండ్ల జ్యోతి, తలారి రాధాకృష్ణలతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, గుమ్మడి కనకరాజు, ఏలీయ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, గంగాధర్, వీరబాబు, భాస్కర్, రామారావు, దయానంద్, సుందర్‌రావు, నాగేశ్వరరావు ఉన్నారు.

కిటకిటలాడుతున్న కేఎంసీ..



ఉచిత విద్యుత్, గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలోనే ప్రజలు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇందుకు సంబంధించి మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అధికారులు అవకాశం ఇచ్చారు. దీంతో కొన్ని రోజులుగా కేఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్నారు. అప్పుటి నుంచి రద్దీ కొనసాగుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో సవరణల కోసం.. అలాగే కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో కేఎంసీ కార్యాలయం కిటకిటలాడుతోంది. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్